
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 30.2 : కనిష్టం 19.8
కామారెడ్డి జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 జనవరి 2024









జోరుగా.. గంజాయి దందా



- గంజాయికి చిత్తవుతున్న యువత
- మైనర్లను మత్తులో ముంచుతున్న గంజాయి స్మగ్లర్లు
- మత్తులో దౌర్జన్యాలు, ప్రమాదాలకు కారణమవుతున్న యువత
- ఓ యువకుడిపై దాడి.. చికిత్స పొందుతూ మృతి
- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి
- ఎక్సైజ్ పోలీసులు నిఘా పెట్టినా ఆగని దందా
- గుట్టుగా గంజాయి విక్రయాలు
- ఇటీవల గంజాయి నూనెను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- గుట్టుగా వైజాగ్, మహారాష్ట్ర నుంచి జిల్లాకు గంజాయి రవాణా
- పోలీసుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న గంజాయి సరఫరా

కామారెడ్డి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి గంజాయి దందాకు అడ్డాగా మారుతోంది. పక్షం రోజుల్లోనే కామారెడ్డిలో పలుచోట్ల గంజాయి మూలాలను పోలీసులు, ఎక్సైజ్‌శాఖలు గుర్తించాయి. గంజాయి దందాలోని స్మగ్లర్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. గతంలో గంజాయిని పొడిగా విక్రయించి దందా కొనసాగించేవారు. అయితే ఈ దందాపై నిఘా పెట్టడంతో స్మగ్లర్లు కొత్తదారులు ఎంచుకుని నూనె రూపంలో విక్రయిస్తూ కొత్త దందాకు తెర లేపారు. నూనె రూపంలో విక్రయిస్తున్న గంజాయి దందాను పోలీసులు ఇటీవల గుర్తించిన విషయం తెలిసిందే. అయితే స్మగ్లర్లు యువత, మైనర్లనే టార్గెట్‌గా చేసుకుని గంజాయి దందా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు శివారు ప్రాంతాల్లో గంజాయి వినియోగం బాగానే పెరిగినట్లు తెలుస్తోంది. దీనికి నిదర్శనం ఇటీవల కామారెడ్డి పట్టణంలో గంజాయి మత్తులో కొందరు యువకులు ఓ యువకుడిపై దాడి చేసిన ఘటనలో సదరు యువకుడు మృతి చెందడం కలకలం రేపుతోంది. ఓ వైపు ప్రభుత్వం మత్తుపదా ర్థాలను, డ్రగ్స్, గంజాయిని నిర్మూలించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటునే ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేస్తోంది. ఇదేక్రమంలో ఎక్సైజ్, పోలీసుశాఖలు గంజాయిపై నిఘాపెట్టి తనిఖీలు చేస్తున్నా గంజా యిదందా మాత్రం ఆగడం లేదు.

కామారెడ్డిలో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాలు యువతను టార్గెట్ చేసుకుని మత్తు కోసం గంజాయి అంటగడుతున్నారు. చిన్నచిన్న పొట్లాల రూపంలో అమ్ముతున్నారు. అప్పుడప్పుడు గంజాయి అమ్మకాల విషయం తెలిసి పోలీసులు దాడులు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు అడ్డాలతో పాటు జాతీయ రహదారి వెంట కొన్ని అడ్డాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా ద్వారా లోకేషన్ షేర్ చేసి అక్కడికి రప్పిస్తున్నారు. విద్యార్థులు, యువకులు మత్తుకోసం గంజాయికి అలవాటు పడుతున్నారు. ఒకరిని చూసి ఒకరు గంజాయి పీలుస్తూ మత్తులో మునిగి తేలుతున్నారు. కామారెడ్డి పట్టణంలో యువత, విద్యార్థులే కాకుండా కొందరు కార్మికులు, అడ్డ లేబర్‌లు గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి రోడ్లపైనే స్పృహ కోల్పోయి పడిపో తున్నారు.

గంజాయి విక్రయాల్లో కొత్త పుంతలు

కామారెడ్డిలో గంజాయి దందాలో, విక్రయాల్లో స్మగ్లర్లు కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో కామారెడ్డి, గాంధారి గంజాయి విక్రయాలకు, సాగుకు అడ్డాగా ఉండేది. గాంధారిలో పంట పొలాల్లోనే కాకుండా అటవీ ప్రాంతాల్లో కొందరు స్మగ్లర్లు గంజాయిని సాగు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేవారు. గంజాయిని సాగు చేసే వారిపై పోలీసులు, ఎక్సైజ్‌శాఖలు పీడీయాక్ట్ పెట్టి కొంత నిర్మూలించగలిగారు. అయితే గంజాయిని వైజాగ్, మహారాష్ట్ర లాంటి ప్రాంతాల నుంచి పొడి రూపంలో తీసుకువచ్చి పొట్లాల్లో విక్రయించేవారు. దీనిపై అధికార యంత్రాంగం నిఘా పెట్టడంతో వేరేదారులు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. గంజాయిని లిక్విడ్, నూనె రూపంలో తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నట్లు ఇటీవల పోలీసుల తనిఖీల్లో బయటపడింది. కామారెడ్డి పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు ద్రవ రూపంలో ఉన్న గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి నూనె రూపంలో చిన్నచిన్న డబ్బాల్లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని నార్కోటిక్ విభాగం పోలీసులు కల్లులో కలిపే మత్తుపదార్థాల సరఫరా ముఠాను పట్టుకోగా ఆ ముఠాలో కామారెడ్డికి చెందిన ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్, మరో ఇద్దరు వ్యక్తులు ఈ దందాను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

మత్తులో విచక్షణ కోల్పోతున్న యువత

యువత, మైనర్లను టార్గెట్ చేసుకుని సరఫరా చేయించడం, వారిని మత్తులో దించడం చేస్తున్నారు. గత ఏడాది కిందటి వరకు పట్టణ ప్రాంతాల్లో కనిపించిన గంజాయి స్మోకింగ్ కల్చర్ ఇప్పుడు గ్రామాల్లో కనిపిస్తుండడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల శివారు ప్రాంతాలతో పాటు కామారెడ్డి పట్టణంలోని ఆయా వార్డుల శివారు ప్రాంతాల్లోకి గంజాయిని తీసుకువచ్చి యువత, మైనర్‌లకు అందిస్తున్నట్లు ఆయా ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇటీవల కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఐదుగురు యువకులు గంజాయి, మద్యం మత్తులో మరో ఇద్దరు యువకులపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఓ యువకుడు సూర్యకాంత్ మృతి చెందిన ఘటన కామారెడ్డిలో కలకలం రేపుతోంది. ఈ ఘటనపై పోలీసుశాఖ మరింత సీరియస్‌గా తీసుకుంటుంది.



ఇటీవల క్యాసంపల్లిలో గుర్తించిన గంజాయి నూనె

మరింత నిఘా పెట్టాల్సిందే..

గంజాయి స్మగ్లింగ్, స్మోకింగ్, మైనర్లకు అలవాటు చేస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారనే సమాచారంతో పాటు ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణిచివేయాలని సూచించడంతో పోలీసులు గంజాయి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టారు. మత్తును ఇచ్చే పానీయాల తయారీపై సైతం దృష్టి సారించారు. బుధవారం జిల్లాలోని గాంధారి మండలం మూడు తండాల్లో పెద్దఎత్తున తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా పంట పొలాల్లో తనిఖీలు చేపట్టి అంతరపం టగా ఎవరైన గంజాయి సాగు చేస్తున్నారనే దానిపై ఆరా తీశారు. గంజాయిని సప్లయ్ చేస్తున్నట్లు గాని, స్మోకింగ్ చేస్తున్నట్లు గాని ప్రజలు తమ దృష్టికి తెస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచిస్తున్నారు.



సూర్యకాంత్‌పై దాడి చేస్తుండగా సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం (ఇన్‌సెట్‌లో మృతుడు సూర్యకాంత్)

ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 18: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25న బూత్ స్థాయి మొదలుకొని జిల్లా స్థాయి వరకు ఓటర్ల అవగాహన కోసం వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవంపై గురువారం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు ఎంతో విలువైనదని శక్తివంతమైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన యువత వందశాతం ఓటరుగా నమోదయ్యేలా చూడాలని అన్నారు. ఇందుకోసం ఈనెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని, బూత్ స్థాయి అధికారులు ఫారం 6,7,8లతో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు నమోదుతో పాటు క్లెయిములు, అభ్యంతరాలకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. జూనియర్, డిగ్రీ కళాశాలలో లిటరసీ క్లబ్బుల ద్వారా ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాలు, నిర్భయంగా ఓటు వేసేందుకు ప్రోత్సహించాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలని, వృద్ధ ఓటర్ల అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఓటు ప్రాముఖ్యతపై ఈనెల 23న డివిజన్ స్థాయిలో, 24న జిల్లా స్థాయిలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించాలన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా ఈనెల 25న జిల్లా కేంద్రంలో సీనియర్ ఓటర్లను సత్కరించాలని, కొత్తగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని తెలిపారు. విజేతలకు నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. అదేవిధంగా నూతనంగా ఓటరుగా నమోదయిన వారికి ఫొటో ఎపిక్ కార్డులు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డీవో శ్రీనివాస్‌రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త వరి వంగడాలు వేసుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలి

రైతులు కొత్త వరి వంగడాలు వేసుకునే విధంగా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశువుల పెంపకం, చేపల చెరువులు ఏర్పాటు చేసుకుని అదనంగా ఆదాయం పొందేవిధంగా చూసుకోవాలన్నారు. జొన్న పండించే రైతులు అదనంగా ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేస్తే గిట్టుబాటు ధర పొందే వీలుందని తెలిపారు. రైతులు చిరుధాన్యాలు, కూరగాయల సాగును చేపట్టే విధంగా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ భాగ్యలక్ష్మీ, అధ్యక్షుడు నర్సింలు, ఏడీఏలు రత్న, అపర్ణ, భారతీ, వ్యవసాయాధికారులు ప్రజాపతి, హరీష్‌కుమార్, శ్రీకాంత్, విజయ, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బినామీలకు చెక్

- రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేయాలంటూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆదేశం
- వివరాలు సేకరిస్తున్న ఆయా మండలాల రెవెన్యూ సిబ్బంది
- రేపటిలోగా క్షేత్రస్థాయిలో దుకాణాల తనిఖీకి గడువు
- ఈ నెలాఖరులోగా తుది నివేదికను అందించాలని ఆదేశాలు

కామారెడ్డి టౌన్, జనవరి 18: బినామీ రేషన్ డీలర్లకు ప్రభుత్వం చెక్ పెట్టేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఈ అంశంపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 20లోగా క్షేత్రస్థాయిలో దుకాణాలను తనిఖీ చేయాలని, ఈ నెలాఖరులోగా తుది నివేదికను అందించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 578 దుకాణాల వివరాలను ఆయా మండలాల రెవెన్యూ సిబ్బంది సేకరిస్తున్నారు. దుకాణం బోర్డుపై పేరున్న వ్యక్తే నడిపిస్తున్నాడా.. లేక వేరే వ్యక్తికి అప్పగించారా డీలర్ మృతి చెందిన చోట ఆయన కుటుంబ సభ్యులు కాకుండా వేరేవారెవరైనా నడిపిస్తున్నారా అనే అంశాలపై సర్వే చేయనున్నారు.

పక్కాగా పరిశీలన

కొందరు రేషన్ డీలర్లు ఇతర పనులు చేసుకుంటుండగా మరికొందరు పట్టణ ప్రాంతాల్లో ఉంటూ వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మహిళలకు ఉపాధి మార్గం చూపించాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో అనేక మందికి డీలర్ షాపులు మంజూరు చేశారు. ఎవరికి కేటాయించారో వారే దుకాణంలో ఉంటూ నిత్యావసరాలు ప్రజలకు విక్రయించాల్సి ఉండగా, ఎక్కడ మహిళా డీలర్లు షాపుల్లో ఉంటున్న దాఖలాలు లేవు. అనేక గ్రామాల్లో యువతుల పేర్లపై రేషన్ దుకాణాలు తీసుకున్నారు. వారు వివాహాలు చేసుకుని వెళ్లిపోవడంతో ఆయా దుకాణాలను ఇతరులకు అప్పగించారు. అధికారులు నేరుగా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి చూడడమేకాకుండా ప్రతీనెల రేషన్ ఎవరు పోస్తున్నారు.. ఎవరు నడిపిస్తున్నారు.. ఈ పాస్ యంత్రాల్లో ఎంత మంది వేలిముద్రలు మారాయి. ఎవరి ఖాతాల్లోకి కమీషన్ డబ్బులు వెళ్తున్నాయనే అంశాలను పక్కాగా పరిశీలన చేయనున్నారు.

బినామీల ఖాతాల్లోకి కమీషన్

రేషన్ దుకాణాల్లో రేషన్ పోసేందుకు డీలర్లతో పాటు వారి కుటుంబంలో మరో ఇద్దరికి మాత్రమే ఈ పాస్ మిషన్‌లో తంబ్‌వేసే అవకాశం కల్పించారు. ఒక వేళ డీలర్ అందుబాటులో లేకుంటే ఆయన స్థానంలో వేలిముద్ర వేసి రేషన్ పంపిణీ చేసుకునే వెసులుబాటు కల్పించారు. కానీ కొన్నిచోట్ల రేషన్ దుకాణాల బాధ్యతలను ఇన్‌చార్జీలకు అప్పగిస్తే వారు బినామీలకు అప్పగించినట్లు తెలుస్తోంది. తహసీల్దార్ కార్యాలయాల సిబ్బందికి వేలిముద్రలు మార్చే అధికారం ఉంది. దీంతో ఎవరికి కావాలంటే వారికి వేలిముద్రలు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.140 చొప్పున డీలర్ల ఖాతాలో జమ చేస్తోంది. ఇలా కొందరు బినామీలు డీలర్లుగా అవతారం ఎత్తడమేకాకుండా వారి బ్యాంకు ఖాతాలను పౌర సరఫరాలశాఖ వద్ద నమోదు చేయించుకున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే కమీషన్ డబ్బులు నేరుగా బినామీల ఖాతాల్లోనే జమ అవుతున్నాయి.



బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా అరుణతార మరోసారి నియామకం



కామారెడ్డి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా అరుణతారను మరోసారి నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం తెలంగాణలోని పలు జిల్లాల అధ్యక్షులను నియమించింది. ఇందులో కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా అరుణతారకే రెండోసారి అవకాశం కల్పించారు. గత ఐదేళ్ల పాటు అరుణతార జిల్లా అధ్యక్షురాలుగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం చేస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే జిల్లా నుంచి పార్టీ అధ్యక్షులుగా అరుణతారకు పోటీగా ఎవరూ లేకపోవడం జిల్లా నాయకత్వం ఆమెనే అధ్యక్షురాలుగా కొనసాగించాలని అధిష్టానాన్ని కోరినట్లు తెలిసింది. దీంతో అరుణతారకే రెండోసారి పార్టీ పగ్గాలను అధిష్టానం నియమించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

జిల్లాలో యాసంగి సాగు లక్ష్యం 3.90 లక్షల ఎకరాలు

- ఇప్పటి వరకు రెండు లక్షల ఎకరాల్లో సాగు పూర్తి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మీ



మాల్తుమ్మెదలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మీ

నాగిరెడ్డిపేట, జనవరి 18 : ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో వివిధ పంటల సాగు లక్ష్యం 3.90 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారని, ఫిబ్రవరి మొదటి వారంలోగా వంద శాతం లక్ష్యం పూర్తి చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మీ తెలిపారు. ఆమె గురువారం మాల్తుమ్మెద విత్తన క్షేత్రానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం యాసంగిలో 2లక్షల 60వేల ఎకరాలలో వరి పంట సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 90వేల ఎకరాలలో నాట్లు వేయడం పూర్తయినట్లు తెలిపారు. వరి నారుమళ్లు నాట్ల కోసం సిద్ధంగా ఉన్నాయని, ఫిబ్రవరి మొదటి వారంలోగా వరి నాట్లు వేయడం పూర్తమవుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 64,552 ఎకరాల్లో శనగ, 26,500 ఎకరాల్లో మొక్కజొన్న, 14,700 ఎకరాల్లో జొన్న, 1007 ఎకరాల్లో వేరు శనగ, 3,994 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 988 ఎకరాల్లో కుసుమ పంటలను రైతులు సాగు చేశారని ఆమె తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రైతు బంధు 1,57,373 మంది రైతులకు 50 కోట్ల 62 లక్షల 52 వేల 053 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో లక్షా 55వేల ఎకరాల్లో పంటల నమోదు పూర్తయినట్లు తెలిపారు. మాల్తుమ్మెద విత్తన క్షేత్రం భూములు అక్రమంగా కబ్జాకు గురి కాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం, విత్తన క్షేత్రం ఏడీఏ వీరాస్వామి పాల్గొన్నారు.



చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలపై
కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో అనుమతులిచ్చి శంకుస్థాపనలు చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తిచేసి అగ్రిమెంట్లు చేసుకొని ప్రోటోకాల్ ప్రకారం శిలా ఫలకాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం మారి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాలతో మళ్లీ అవే పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారని, వీటిని ఆపాలని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజామాబాద్, ధర్పల్లి ప్రధాన రోడ్డులో వెంగల్‌పాడ్ గ్రామం వద్ద మొరగువాగుపై గత సంవత్సరం అక్టోబర్ 6న శంకుస్థాపన హైలెవల్ బ్రిడ్జి కోసం చేశామన్నారు. అదేరోజు లింగాపూర్ వాగు హైలెవల్ బ్రిడ్జి, వాడి గ్రామం వద్ద ముత్యాలవాగు పై హైలెవల్ బ్రిడ్జి, గడ్కోల్ గ్రామం వద్ద కప్పలవాగుపై హైలెవల్ బ్రిడ్జికు శంకుస్థాపనలు చేశామన్నారు. వీటికి మళ్లీ శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.







ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వాడి సర్పంచ్


ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వాడి సర్పంచ్

ధర్పల్లి, జనవరి 18 : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో గురువారం సాయంత్రం మండలంలోని వాడి సర్పంచ్ భాగవ్వ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ బేల్దారి కృష్ణ, ఒన్నాజిపేట్ సర్పంచ్ భగవంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ సోషల్ ఆడిట్ వివరాలు సమర్పించాలి'

డిచ్‌పల్లి, జనవరి 18: మండంలో 34గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల తాలూకు టీఏ, ఎఫ్ఏ, ఈసీ లు సభ్యులందరు సోషల్ ఆడిట్ వివరాలు తక్షణమే సంబంధిత శాఖ అధికారులకు అందజేసి వివరాలు చెప్పాలని అంబుట్స్ మ్యాన్ శ్రీనివాస్ సూచించారు. గురువారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీడీ ఒంపాల్ తో కలిసి అంబుట్స్ మ్యాన్‌సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధిహామీ సిబ్బంది సోషల్ ఆడిట్ స్పార సబ్‌మిషన్ వివరాలు సకాలంలో అందించి అధికారులకు సహకరించలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుధాకర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కొండ మైనారిటీ పాఠశాలలో ..

ముప్కాల్, జనవరి18: బాల్కొండ మైనారిటీ పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశం కొరకు 30మైనారిటీ సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు 8, 9తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతీఒక్కరు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

గాంధీనగర్, ఆశాజ్యోతి కాలనీలలో గ్రామసభలు

నవీపేట, జనవరి 18 : మండలంలోని గాంధీనగర్, ఆశాజ్యోతి కాలనీలలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. డ్రోన్ ద్వారా రసాయన ఎరువులు పంట పొలాలకు పిచికారి చేసే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, మెడికల్ ఆఫీసర్ స్రామాట్ యాదవ్, గాంధీనగర్ సర్పంచ్ మచ్చ ఆదిలక్ష్మి, బినోల ఎంపీటీసీ పద్మ, తదితరులున్నారు.

సాహిత్యంలో బహుమతులు గెలుపొందిన తడపాకల్ విద్యార్థులు


బహుమతులు గెలుపొందిన తడపాకల్ విద్యార్థులు

ఏర్గట్ల, జనవరి 18: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు డేగల వైష్ణవి రాసిన బంగారు బాల్యం కవితకు మొదటి బహుమతి అలాగే శ్రీజా పట్టుదల అనే కథకు ద్వితీయ బహుమతి పొందగా, శ్రీలేఖ రాసిన తెలుగు భాష అనే కవితకు ద్వితీయ బహుమతి లభించిందని తెలుగు పండితుడు ప్రవీణ్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనడాదేశం నుంచి నిర్వహించే అంతర్జాతీయ మాసపత్రిక గడుగ్గాయి వారు సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కథల పోటీలో అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు గెలుపొందినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

జెండా బాలాజీ మందిర శుద్ధీకరణ కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, జనవరి18: పట్టణంలోని జెండాబాలాజీ మందిర ఆవరణను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛ తీర్థ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మందిర శుద్ధికరణ నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామచంద్రుని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు తమ గ్రామంలో ఉన్న దేవాలయాలను శుభ్రం పరిచినట్టు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, అధికార ప్రతినిధి జెస్సు అనిల్, ఓబీసీమోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రిబాస్కర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కంచెట్టి గంగాధర్, నూతుల శ్రీనివాస్, పొల్కం వేణు, పులి యుగంధర్, బాశెట్టి రాజ్‌కుమార్, కార్తిక్‌సింగ్, ఉదయ్‌గౌడ్, కిరణ్, రాము, పల్లె శ్రీనివాస్, రవి, శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బోంకన్‌పల్లి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మాక్లూర్, జనవరి18: మాక్లూర్ మండలం బోంకపల్లి గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అనంతరం ముల్లంగి, బోంకన్‌పల్లి లిఫ్ట్ పనులను జడ్పీచైర్మన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ పూజిత, ఎంపీడీవో క్రాంతి, ముల్లంగి ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, ఏపీఎం అనిల్, నాయకులు రమణరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన మహమ్మద్ షరీఫ్(35) భార్య, కుమార్తెతో కలిసి పాత బస్తీ శాలిబండలో నివసిస్తూ శుభకార్యాలలో మటన్ కట్ చేస్తూ జీవిస్తున్నాడు. ఐదు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న షరీఫ్ ఇంటికి అద్దె కట్టలేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం శివరాంపల్లి-ఫలక్‌నూమ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి నాలుగు రోజుల జైలు

నిజామాబాద్ లీగల్, జనవరి 18: మద్యం సేవించి వాహనాన్ని నడిపిన షేక్ అన్వర్, కొన్నె మహేందర్‌లకు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖాదీర్ 4రోజుల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు.... వివరాల్లోకి వెళితే గాంధీ చౌక్‌లో పోలీసు వారు నిర్వహించిన వాహనాల తనిఖీలో భాగంగా వీరు మద్యం సేవించి నడుపుతున్నప్పుడు వారిని పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారించిన పత్రాలను కోర్టులో దాఖలు చేయగా కోర్టులో వారు నేరాన్ని అంగీకరిం చడంతో 4రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

వరదకాలువ నీటి నిలిపివేత

ముప్కాల్, జనవరి 18 : శ్రీరాంసాగర్ ప్రధాన కాలువలో ఒకటైన వరదకాలువకు గురువారం నీటి విడుదల నిలిపివేసినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. యాసంగి పంట సాగు కోసం మూడు వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇరిగేషన్ అధికారుల ఆదేశాలతో హెడ్‌రెగ్యులేటర్ నీటిని నిలిపివేసినట్టు వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (90.31టీఎంసీ)లు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో (1082.50) అడుగులు కాగా (59.49టీఎంసీ)ల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

బాల్కొండలో పేకాటరాయుళ్ల అరెస్టు

ముప్కాల్, జనవరి18: బాల్కొండ మండల కేంద్రంలోని అంతర్‌గల్లీలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్ళను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5420 నగదు స్వాధీనం చేసు కొని, వారి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై గోపి తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు

జక్రాన్‌పల్లి, జనవరి18: మండలంలోని అర్గుల్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ సూర్యసురేష్ తల్లి సూర్య నర్సుబాయి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం అర్గుల్ గ్రామంలో సూర్య నర్సుబాయి అంత్యక్రియలలో మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు పాల్గొన్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ సూర్యసురేష్‌ను, కుటుంబసభ్యులను మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ అంత్యక్రియల్లో ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్‌ఎంపీపీ తిరుపతిరెడ్డి, స్థానిక సర్పంచ్ గోర్త పద్మ, ఉప సర్పంచ్ గోర్త రాజేందర్, వీడీసీచైర్మన్ రాజారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోజన్న, దికొండ శ్రీనివాస్, మండల కోఆప్షన్‌సభ్యుడు అక్బర్‌ఖాన్, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈనెల 20న నవోదయ పరీక్ష

ఖిల్లా, జనవరి 18 : ఈనెల 20న నవోదయ పరీక్ష జరుగుతుందని ఈ పరీక్ష కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నాం 1.30 వరకు 13 సెంటర్లలో జరుగుతుందని తెలిపారు. కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో అన్ని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలను ఇచ్చారు. సంబంధిత కేంద్రాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌హెచ్‌వోలు పర్యవేక్షించాలని ఆదేశాలను ఆయన ఇచ్చారు.



నీలా దర్గాలో చాదర్ సమర్పణ



దర్గాలో చాదర్ సమర్పిస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే

రెంజల్,జనవరి18:మండలంలోని నీలా గ్రామంలో గల సైలాని బాబా దర్గాను నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి సందర్శించి దర్గాలో చాదర్‌ను సమర్పించారు. ఆయనకు దర్గా నిర్వాహకుడు వహీద్ ఘనంగా సన్మానించారు. నీలా గ్రామంలోని సైలాని బాబా దర్గాను దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సైలాని బాబా దర్గా విశిష్టతను తెలుసుకుని దర్గాకు వచ్చి చాదర్‌ను సమర్పించడం జరిగిందని ఆయన అన్నారు. ఆయన వెంట గాయసోద్దీన్, షబాజ్, సర్దార్ ఖాన్ తదితరులున్నారు.

శ్రీరామ ప్రసాద లడ్డును స్వాగతించిన ట్రస్టు సభ్యులు

ఆర్మూర్‌రూరల్, జనవరి18: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పెర్కిట్‌లో గురువారం శ్రీరామ ప్రసాద లడ్డును అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు స్వాగతించారు. హైదరాబాద్‌లో రామ భక్తుడు చేయించిన 1100కిలోల లడ్డు హైదరాబాద్ నుంచి అయోధ్యకు తీసుకువెళ్తుండగా పెర్కిట్‌లో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు స్వాగతించి పెర్కిట్‌లోని శివాలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలెపు రాజు ద్యాగ ఉదయ్, రాస రాము, అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో మండల పూజ

డొంకేశ్వర్, జనవరి18: డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పూజ కార్యక్రమాన్ని సంఘ సభ్యులు నిర్వహించారు.సంకల్పం, గణపతి,గౌరీపూజ, అమ్మవారి పంచామృతలతో అభిషేకం,హారతి,మంత్రపుష్పం, ప్రసాదవితరణ వంటికార్యక్రమాలు నిర్వ హించినట్టు శేఖర్ పంతులు తెలిపారు. అనంతరం వచ్చినటువంటి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులుఅధిక సంఖ్యలోపాల్గొని అమ్మ వారికి దర్శించుకున్నారు.ఈకార్యక్రమంలో ముదిరాజ్‌సంఘసభ్యులు, పాల్గొన్నారు.

ముప్కాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ముప్కాల్, జనవరి18: ముప్కాల్ మండల కేంద్రంలో సీసీకెమెరాల ఏర్పాటుకు సహకారం అందించాలని ముప్కాల్ ఎస్సై భాస్కరచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో నేను సైతం కార్యక్రమంలో భాగంగా వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతోగానో ఉపయోగపడుతాయని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ వ్యాపార యాజమానులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ రికవరీ చేసిన రైల్వే పోలీసులు

ఖిల్లా, జనవరి 18: నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఫాట్‌ఫామ్‌పైన ఒక వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ ఈనెల 17న అర్థరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకొని పారిపోగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని ఫోన్‌ను రికవరీ చేశారు. నిందితుడు పిల్లిసాగర్‌గా రైల్వే ఎస్‌హెచ్‌వో ఓ.సాయిరెడ్డి తెలిపారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దర్యాప్తులో సిబ్బంది హన్మాండ్లు, రవికిరణ్, రాములు, సీన ఆయన అభినందించారు.

టీయూ నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్

డిచ్‌పల్లి, జనవరి 18: తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బుర్రవెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి 2024 నూతనసంవత్సర క్యాలండర్ గురువారం రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. అధ్యాపకులు క్రమశిక్షణ తో పనిచేస్తు బోధనలో, పరిశోధనలో వర్సిటీని తెలంగాణ లోనే అగ్రగామి గా నిలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ సత్యనారాయణ, ప్రొ.అరతి, డా.ప్రసన్న రాణి, ప్రొ.ఘంట చంద్రశేఖర్, అంతర్గాత పాలకమండలి సభ్యులు ప్రొ.నసీం, రవీందర్‌రెడ్డి, డీన్స్‌ప్రొ.త్రివేణి, ప్రొ.రాంబాబు, ప్రొ.ఆంజనేయులు, డా.పున్నయ్య, డా.మహేందర్, డా.అపర్ణ, పాల్గొన్నారు.

● ఎస్‌బీఐ క్యాలండర్‌ను ఆవిష్కరించిన టీయూ రిజిస్ట్రార్

ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తెలంగాణ యూనివర్సిటీ శాఖ 2024 నూతన సంవత్సర క్యాలండర్, మరియు డైరీలను టీయూ రిజిస్ట్రార్ ప్రొ యాదగిరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నూనవత్ కిషన్ సింగ్, సీనియర్ అసోసియేట్ రాథోడ్ రవీందర్, తదితరులు ఉన్నారు.

బెల్టు షాపులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● తమకు న్యాయం చేయాలని మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన

● గంటపాటు నిలిచిపోయిన వాహనాలు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

నవీపేట, జనవరి 18 : నవీపేటలోని ప్రధాన చౌరస్తాలో గల బెల్టు షాపులో గురువారం డాంకే సాయిలు(62)అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని దర్యాపూర్‌కు చెందిన డాంకే సాయిలు గురువారం చాంద్ పాషా అనే మిత్రుడితో కలిసి నవీపేటలోని బెల్టు షాపులో మద్యం తాగేందుకు వెళ్లాడు. అరగంట తర్వాత బెల్టు షాపు నిర్వాహకుడు సంజీవరెడ్డితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి సాయిలును బెల్టు షాపు నుండి బయటకు మోసుకొచ్చి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం ఎదుట పడుకోబెట్టి వెళ్లిపోయారు. సాయిలు తలకు బలమైన గాయం ఉండగా.. తలకు చుట్టుకున్న టవాల్ రక్తంతో తడిసిపోయి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సాయిలును కుటుంబ సభ్యులు నవీపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి వచ్చి బెల్టు షాపు యజమాని సంజీవ రెడ్డిని నిలదీశారు. సాయిలు మృతికి కారణం ఏంటని ప్రశ్నించగా.. అతడు మెట్ల పై నుంచి పడిపోవడంతో గాయపడ్డాడని సమాధానం ఇచ్చాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయిలు వద్ద పొలంలో కూలీలకు చెల్లించడానికి 8వేల రూపాయల నగదు ఉందని, మృతుడి వద్ద ఆ నగదు లభించలేదన్నారు. సాయిలును బెల్టు షాపు నుండి బయటకు మోసుకొచ్చి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం ఎదుట పడుకోబెట్టిన దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయని తెలిపారు. ఘటనకు సంజీవ రెడ్డి బాధ్యత వహించాలని, వెంటనే తమకు నష్ట పరిహారం అందించి న్యాయం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత నవీపేట ప్రధాన రహదారిపై సాయిలు మృతదేహన్ని రోడ్డు పై ఉంచి గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో సమాచారం అందుకున్న నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ వెంకట నారాయణ ఘటనా స్థలికి చేరుకొని మృతుడి కుటుంబీకులను సముదాయించారు. బెల్టు షాపు నిర్వాహకుడు సంజీవ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కాగా.. సాయిలుతో కలిసి మద్యం తాగడానికి వెళ్లిన చాంద్ పాషా సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. ఈ క్రమంలో ఘటనలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ వెంకట నారాయణ తెలిపారు.

సొంతింటి కల నెరవేరేనా?

● నందిపేట, మాక్లూర్ మండలాల్లో డబుల్ బెడ్‌రూంల నిర్మాణాలను ఇంకా ప్రారంభించని అధికారులు

● కానరాని రోడ్లు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు



పెర్కిట్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ఇలా..





అంకాపూర్‌లో వివిధ దశల్లో నిలిచి పోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవే..

ఆర్మూర్‌రూరల్, జనవరి 18:గత ప్రభుత్వంబడుగు, బలహీనవర్గాల ప్రజలకు సొంతింటి సౌకర్యం కల్పించాలని రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసింది. అప్పటి సీఎం కేసీఆర్ అర్హులైన వారం దరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అనేక గ్రామాలలో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలకు నోచుకోలేదు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో సుమారు రెండు వేలకు పైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నందిపేట, మాక్లూర్ మండలాల్లో డబుల్‌బెడ్‌రూంల నిర్మాణాలను ప్రారంభించలేదు.

● నాలుగు గ్రామాల్లోనే..

ఆర్మూర్ మండలంలోని నాలుగు గ్రామాల్లోనే రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లి, అంకాపూర్ గ్రామాలలో డబుల్‌బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలో 160రెండు పడక గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా, అందులో 136ఇళ్లు దాదాపు పూర్తి కావొచ్చింది. కొంత మేరకుమౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మామిడిపల్లిలో వంద ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా ఇక్కడ కూడా పనులు పూర్తిఅయి,రోడ్లు,సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు పూర్తి చేయాల్సిఉంది. అంకా పూర్ గ్రామంలో 165ఇళ్లు నిర్మించాలని సంకల్పించి ప్రారంభించగా 112 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. పెర్కిట్‌లో వంద ఇళ్ల నిర్మాణం ప్రారంభిం చగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యి చిన్నపాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

● దరఖాస్తు చేసుకున్న వారి ఎదురుచూపులు

ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. వారికి సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశతో ఉన్నారు. ఆరు నెలల క్రితం డబుల్‌బెడ్‌రూంల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, నాయకులు సూచించడంతో గ్రామాలలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో డబుల్‌బెడ్‌రూంలకు దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు గ్రామాలలోనే పనులు ప్రారంభించినప్పటికీ సొంతింటి కల నేరవేరుతుందన్న ఆశతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఏ ఒక్క గ్రామంలో కూడా ఇళ్లు నిర్మాణం పనులు ముందుకు సాగలేదు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇళ్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రచారం నిర్వహించారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సొంతింటి సహకరానికి మోక్షం లభిస్తోందని లబ్ధిదారులు ఆశాభావంతో ఉన్నారు.

తెలంగాణ జన సమితి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జనవరి 18: తెలంగాణ జన సమితి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మన్‌యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కొదండరాం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలి పారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీలు తక్షణమే అమలయ్యే విధంగా కేంద్ర ప్రభు త్వంపై ఆ సదస్సులో ఒత్తిడి తెచ్చే విధంగా చర్చ జరపనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఈ 10సం వత్సరాల కాలంలో ఒక్కటి అమలుచేయక తెలంగాణ ప్రాంతం పట్ల వివక్ష చూపుతున్న ందున తక్షణమే అమలు చేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విభజన హామీల అమలు కోసం తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించే సమావేశానికి ఉద్యమ కారులు, మేధావులు, తెలంగాణవాదులు, ప్రజలు, జర్నలిస్టులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో హజరై విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాజేందర్, టీజేఎస్ నాయకులు వివేక్‌యాదవ్,రాజు,దినేష్‌కువమార్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



జట్టుకు బహుమతి అందజేస్తున్న అతిథులు



మాట్లాడుతున్న ప్రాంతీయ అధికారిణి అలివేలు

ఆర్మూర్‌రూరల్, జనవరి18: ఆర్మూర్ పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి సాంఘీక సంక్షేమ విద్యాసంస్థ ప్రాంతీయ అధికారిణి అలివేలు హాజరై విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలలో రాణించి తెలంగాణ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమేనని, గెలుపొందిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, ఓటమి చెందిన క్రీడాకారులు గెలుపు కోసం పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు మాట్లాడుతూ వచ్చేనెల 3వ తేదీ న చత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయ పోటీలలో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు మాట్లాడుతూ.. సాఫ్ట్‌బాల్ జిల్లా క్రీడాకారులు క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతోషకరమన్నారు. పోటీలలో బాలికల విభాగంలో నిజామాబాద జట్టు ప్రథమ స్థానంలో నిలవగా మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానం, కరీంనగర్ 3వ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, మెదక్ జట్టు ద్వితీయ స్థానంలో, నిజామాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, టోర్నీ ఆర్గనైజింగ్ మల్లేష్‌గౌడ్, యునిస్‌పాషా, నాగరాజు, సుద్దపల్లి, వేల్పూర్ పాఠశాలల ప్రిన్సిపాల్ గోదావరి, స్వప్న, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూరల్‌లో మళ్లీ మొరం అక్రమ తవ్వకాలు

● మండలంలో పలు చోట్ల గుట్టుగా తవ్వకాలు ● జేసీబీలు, పొక్లెయినర్‌లతో దర్జాగా దందా ● పట్టించుకోని అధికారులు



మొరాన్ని తరలించడానికి సిద్ధంగా ఉన్న టిప్పర్లు



మొరం తవ్వకాలను నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్‌రూరల్, జనవరి 18: రూరల్ మండలంలో మళ్లీ అక్రమ మొరం దందా గుట్టుగా సాగుతోంది. గత ప్రభుత్వం హయాం లో దర్జాగా మొరం తవ్వకాలు చేసి గుట్టలు గుల్లలు చేసినవారు తిరిగి మళ్లీ అక్రమ దందాకు తెరలేపారు. అధికార, విప పార్టీలకు చెందిన కొందరు నేతలు ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. గత కొద్ది రోజులుగా గాంధీనగర్, గుండారం, మల్కాపూర్ ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహిస్తున్నారు. జేసీబీలు, ప్రొక్లయినర్‌లతో గుట్టలను తవ్వుతున్నారు. వెంటది వెంట టిప్పర్ల ద్వారా వాటిని బయటకు తరలిస్తున్నారు. సంక్రాంతి పండుగకు ముందు నుంచి గుట్టుగా ఈ దందా కొనసాగుతోంది. స్థానిక నేతల సహకారంతో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గతంలో గుండారంలో మొరం తవ్వకాలు చేసినప్పుడు టిప్పర్‌కు వంద రూపాయల చొప్పున వీడీసీ వసూలు చేసింది. అప్పటి ప్రజాప్రతినిధుల అండతో స్థానిక ప్రజాప్రతినిదులే దగ్గరుండి మరీ అక్రమంగా వేల టిప్పర్ల మొరం తరలించారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు అడ్డుచెప్పినా అక్రమ మొరం దందా ఆపలేదు. గుండారం గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలించినవారినుంచి గుండారం వీడీసీ పెద్దలు టిప్పర్‌కు రూ.100 చొప్పున సంవత్సరం మొత్తం కలిపి వీడీసీ 18 లక్షల రూపాయలు వసూలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అక్రమ మొరం దందాను తాత్కాలికంగా నిలిపివేశారు. మళ్లీ అక్రమ మొరం తవ్వకాలకు తెరలేపారు. తాజాగా రూరల్ పరిధిలోని గాంధీనగర్‌లో అటవీ ప్రాంతం సమీపంలో గత వారం రోజులుగా అక్రమంగా మొరం తవ్వుతున్నారు. ఈ తతంగాన్ని స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు చెప్పినా స్పందించలేదు. దాంతో కొందరు టాస్క్‌ఫోర్సు అధికారులకు ఫిర్యాదుచేశారు. దాంతో గురువారం మధ్యాహ్నం టాస్క్‌ఫోర్సు ఏసీపీ రాజశేఖర్ రాజు, సీఐ అంజయ్య బృందం మొరం తవ్వుతున్న ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. మొరం తవ్వుతున్న మూడు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేశారు. అక్రమ మొరం తవ్వకానికి పాల్పడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

గడువు లోగా సీఎంఆర్ ధాన్యం అందించాలి

ముప్కాల్, జనవరి18: 2022-23సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్, రబీ కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువు లోగా ప్రభుత్వానికి అందించాలని బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్ ఆదేశించారు. గురువారం బాల్కొండ మండలంలో ఉన్న కిసాన్‌నగర్, నాగాపూర్ గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా యాజమానితో సమావేశమై నిర్దిష్ట గడువులోగా సీఎంఆర్ ధాన్యం సరఫరా చేయాలని సూచించారు. ఇప్పటికే ఆలస్యం జరిగిందని, త్వరితగతిన సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ రాఘవేందర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా సమ్మేళనం

పెర్కిట్, జనవరి18: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో క్రీడా సమ్మేళనం నిర్వహించనున్నారని ఏబీవీపీ ఇందూర్ అధ్యక్షుడు గొడుగు వెంకట కృష్ణ తెలిపారు. స్వామి వివేకానంద 161వ జన్మదినం సందర్భంగా నిర్వహించే యువజనోత్సవాలలో భాగంగా 19నుంచి 21తేదీ వరకు నిర్వహించే క్రీడా సమ్మేళనంలో ఆర్మూర్‌అర్బన్‌లో ప్రభుత్వ ప్రైవేటు, జూనియర్, డిప్లొమా, ఒకేషనల్, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల నైపుణ్యం కృషి ఉండడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

31లోగా రేషన్‌కార్డుల ఈకేవైసీ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

పెర్కిట్, జనవరి18: ఆర్మూర్ మండల రేషన్‌షాప్ డీలర్ల సమావేశం గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలోని రేషన్ కార్డుదారులు యొక్క ఈకేవైసీ 72శాతం పూర్తయ్యిందని ఈనెల 31లోపల మొత్తం కార్డులు ఈకెవైసీ పూర్తి చేయాలని సమ్మేళనంలో తెలిపారు. రేషన్‌కార్డుల వారిగా విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రతీనెల సమావేశాలు నిర్వహించాలని రేషన్‌షాపులలో సమయ వేళలు పాటించాలని సరుకుల పంపిణీ సక్రమంగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావు, ఆర్‌ఐ అశోక్‌సింగ్, జూనియర్ సహాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏలేటి మహిపాల్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ కుంటుబసభ్యులు

కమ్మర్‌పల్లి,జనవరి 18:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ మాజీ మంత్రి ఏలేటి మహిపాల్‌రెడ్డి 33వ వర్ధంతిని పురస్కరిం చుకుని ఆయన సతీమణి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, కుమారులు బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, ఏలేటి నాగార్జున్‌రెడ్డిలతో కలిసి స్వగ్రామం చౌట్‌పల్లిశివారులోని ఆయన సమాధి వద్ద జ్యోతి వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. కార్యకర్తలు తమ కుటుంబసభ్యుల మాదిరి నాటి నుంచి నేటివరకు వెన్నటే ఉంటూ తమ కష్టసుఖాల్లో పాలు పంచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మలశ్రీనివాస్, భజరంగ్ పార్టీమండల అధ్యక్షుడు కట్ట సంజీవ్ పాల్గొన్నారు

మరియతండాలో భారత్ సంకల్పయాత్ర

ధర్పల్లి, జనవరి 18: మండలంలోని మరియతండాలో భారత్ సంకల్పయాత్రను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను డిజిటల్ రూపంలో ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీవో లక్ష్మణ్, ఎంపీవో, కార్యదర్శి పాల్గొన్నారు.

పొతంగల్ సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దు చేయాలని డీసీవోకు వినతి

కోటగిరి,జనవరి18: పొతంగల్ విశాల సహకార పరపతి సంఘం పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు విండో కార్యదర్శి భరత్‌ను తొలగించాలని సహకార సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. డీసీవో సింహచలంను కలిసి గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పొతంగల్ సహకార సంఘ మహజన సభ సకాలంలో నిర్వహించకపోవడంతో సహ సంఘంలో పలు అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని వారు ఫిర్యాదు చేశారు. ఇటీవల నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో సంఘ సభ్యులు ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు విండో కార్యదర్శిని తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు డీసీవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి కొత్త పాలకవర్గాన్ని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై డీసీవో స్పందించి సంఘం లావాదేవీల రికార్డులను సీజ్ చేసి విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. డీసీవో కలిసిన వారిలో సంఘ సభ్యులు సాదుల రమేష్, గోపాల్ రెడ్డి తదితరులున్నారు.



డీసీవోకు ఫిర్యాదు చేస్తున్న పొతంగల్ సహకార సంఘ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకిషన్

నర్సరీల్లో మొక్కల పెరుగుదలపై దృష్టి సారించాలి

రాజంపేట, జనవరి 18: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్జీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో బాలకిషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న వేప, కానుగ మొక్కలను పెంచి వాటికి సంబంధించిన మేయింటనెన్స్ రిజిస్టర్ రాయాలని త్వరలోనే కేంద్ర బృందం మండలానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రోజుకు రెండు సార్లు నీరు పట్టేలా చూడాలని కొన్నిచోట్ల ప్రైమరీ బెడ్స్‌లో సీడ్ వేయకుండా ఉన్నచోట వెంటనే వేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ప్రణాళికల గురించి, పనుల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, ఏపీవో భాస్కర్, టీపీ రాజు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో జంగంపల్లి జట్టుకు మొదటి స్థానం

మాచారెడ్డి, జనవరి 18: మాచారెడ్డి మండల కేంద్రంలో మహ్మద్ షబ్బీర్ అలీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొనగా జంగంపల్లి జట్టు మొదటి స్థానంలో, తుజాల్‌పూర్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. విజేతలకు తహసీల్దార్ శ్వేతా, ఆర్ఐ మాలిక్‌లు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్‌రెడ్డి, మాచారెడ్డి గ్రామ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బాల నర్సాగౌడ్, వెంకట్‌గౌడ్, భిక్షపతిగౌడ్, లక్ష్మీపతి, అక్బర్, రఫిక్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజీవీర్

ఉపాధి హామీలో కూలీలను పెంచాలి

తాడ్వాయి, జనవరి 18: ఉపాధి హామీలో కూలీల సంఖ్యను పెంచాలని తాడ్వాయి ఎంపీడీవో రాజీవీర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూలీల శాతం తగ్గిపోయిందని తెలిపారు. ప్రతీ గ్రామంలో 25 మంది కూలీలకు తగ్గకుండా పనులు నిర్వహించాలని కోరారు. ఎక్కడైన కూలీలు తగ్గినట్లయితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఎఫ్‌సీ భారాణి తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి స్వామి

శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

దోమకొండ, జనవరి 18: జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆత్మహత్యకు కార్యణమైన తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఐడీ కార్డులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ బీబీపేట తహసీల్దార్ ఐడీ కార్డులు ఇవ్వలేదన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీతారాం మధు, నాగారపు రాములు, పులబోయిన రమేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం



కామారెడ్డి టౌన్, జనవరి 18: కామారెడ్డి రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని శవం లభ్యం అయినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. దాదాపు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఎవరైన గుర్తు పడితే కామారెడ్డి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేశారంటూ ఫిర్యాదు



బాన్సువాడ ఆర్డీవో భుజంగరావుకు ఫిర్యాదు అందజేస్తున్న గిరిజనులు

బాన్సువాడ, జనవరి 18: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొయ్యగుట్ట తాండా సమీపంలో తాడ్కోల్ శివారులో గల శ్మశానవాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేశారని గురువారం గిరిజన నాయకులు బాన్సువాడ ఆర్డీవో భుజంగరావుకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో పోరాటం చేసి, కష్టపడి నానా పాట్లు పడితే తమకు గత కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం సుమారు 5 ఎకరాలకు పైగా శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించిందన్నారు. గిరిజన నిరుపేదలలో ఎవరైనా చనిపోతే ఈ స్థలంలోనే ఖననం చేయడం జరుగుతుందన్నారు. తండావాసుల కోసం కేటాయించిన శ్మశానవాటిక స్థలాన్ని కొంతమంది కబ్జా చేశారని, ఆ స్థలాన్ని తమకు అప్పగించాలని వారు అధికారులను కోరారు. లేని పక్షంలో కాలినడకన తండావాసులంతా కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే మానవ హక్కుల సంఘంకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యగుట్ట తండావాసులు తదితరులున్నారు.

'అమ్మఒడి, ఆరోగ్య మహిళ'ను అందరూ వినియోగించుకోవాలి

సదాశివనగర్, జనవరి 18: అమ్మఒడి, ఆరోగ్య మహిళ కార్యక్రమాలను అందరూ వినియోగించుకోవాలని వైద్యాధికారిని ఆస్మా ఆసిన్ అన్నారు. గురువారం సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందాలన్న ఉద్దేశ్యంతో పీహెచ్‌సీలను బలోపేతం చేస్తూ ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ, ప్రతీ గురువారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో మహిళలు బహిరంగంగా చెప్పుకోలేనటువంటి అన్ని సమస్యలను ఆరోగ్య కేంద్రంలో పరీక్షించడం జరుగుతుందని వ్యాధి తీవ్రతను బట్టిమెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొన్న యెండల లక్ష్మీనారాయణ

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నసురుల్లాబాద్, జనవరి 18 : మండలంలోని కాంశెట్టిపల్లి గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోది ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, బీజేపీ అధ్యక్షుడు సున్నం సాయిలు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చందూరి హన్మాండ్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి మేకల రాములు యాదవ్, బ్యాంకు మేనేజర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరు, ఆయిల్ చోరీ

నిజాంసాగర్, జనవరి 18: ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు మళ్లీ రెచ్చిపోయారు. నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో గురువారం రాత్రి దొంగలు రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగి వైరు, కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేశారు. గోర్గల్ గ్రామ శివారులో ఉన్న తమ పంట పొలాలకు రోజు మాదిరిగానే రైతులు సత్తవ్వ, పోచయ్యలు గురువారం ఉదయం వెళ్లగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి వాటిని పగుల గొట్టి అందులో ఉన్న సుమారు లక్షా 50 వేల విలువ గల కాయిల్స్, ఆయిల్ రాగి వైరును ఎత్తు కెళ్లినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారి శ్రీనివాస్ గౌడ్‌కు తెలుపగా, ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై రాజశేఖర్ కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలి

● అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ రావు

నిజాంసాగర్, జనవరి 18: ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ, నిబంధనలను పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రహదారి భద్రత వారోత్సవాలు నెల రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా ఈ రోజు డ్రైవర్లు, వాహనదారులు, ప్రజలకు రోడ్డు భద్రతలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనం నడుపరాదని, 18 సంవత్సరాలు నిండినవారికే లైసెన్సు జారీ అవుతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మితిమీరిన వేగం పనికి రాదని, హెల్మెట్ లేనిదే వాహనం నడిపించవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణించాలని కోరారు. అనంతరం నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్ పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండరి, హసన్ పల్లి సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, వడ్డేపల్లి మాజీ సర్పంచ్ అంజయ్య, తదితరులున్నారు.

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పెద్ద కొడప్‌గల్: వివిధ రకాల వాహనాలు నడిపే వాహనదారులు రోడ్డుభద్రత నియమాలు పాటించి వాహనాలు నడపాలని పెద్ద కొడప్‌గల్ ఎస్‌ఐ కోనా రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని అంజనీ గేట్ వద్ద 161 జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కోనా రెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని వేగంగా వాహనాలు నడపవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాములు, సిబ్బంది వెంకటేష్, సాయిశివ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

భిక్కనూరు: వాహనదారులు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై సాయికుమార్, ఏఎంవీఐలు జయంత్, శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం భిక్కనూరు టోల్‌గేట్ సమీపంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్టు పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, అతివేగం పనికి రాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రవాణశాఖ, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డిలో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమం

కామారెడ్డిటౌన్,జనవరి 18: జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పూరతన ఆలయమైన కిష్టమ్మ గుడి ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు అరుణతార మాట్లాడుతూ.. హిందువుల ఐదు దశాబ్దాల కళ అయోధ్యలో భవ్యరామ మందిర నిర్మాణం పూర్తయి ఈనెల 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా పురాతన మందిరాలను మళ్లి పునరుద్ధరించి దూప, దీప నైవేద్యాలతో పునరుద్ధరించాలని స్వచ్ఛ తీర్థ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 22న ప్రధాని నరేంద్రమోదీ సూచన మేరకు అన్ని గ్రామాలు, అన్ని ఆలయాల్లో దీపాలు వెలిగించి దీపావళి పండుగను తలపించేలా ప్రతి హిందువు పండుగ చేసుకోవాలని కోరారు.

వేణుగోపాలస్వామి గుడిలో 'స్వచ్ఛ తీర్థ'

బీబీపేట: మండల కేంద్రంలోని ప్రాచీన ఆలయమైన వేణుగోపాలస్వామి గుడిలో బీజేపీ నాయకులు స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ప్రాచీన ఆలయాలకు పూర్వవైభవం తెచ్చే ఉద్దేశ్యంతో బీజేపీ ప్రభుత్వం స్వచ్ఛతీర్థ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. గుడిలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి గుడి ఆవరణను పరిశుభ్రం చేసి ఆధ్యాత్మిక శోభ కలిగించామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంజిత్, నక్క రవీందర్, బట్టు భరత్‌రాజ్, కూమారస్వామి, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

మద్నూర్, జనవరి 18: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 20, 21 తేదీల్లో ఆయా గ్రామాల పోలింగ్ స్టేషన్లలో బూత్ లెవల్ అధికారులు కొత్త ఓటర్ల దరఖాస్తులు స్వీకరించాలని మద్నూర్ డిప్యూటీ తహసీల్దార్ భరత్ అన్నారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటర్లు నమోదు చేసుకోవాలని, ఓటర్ గుర్తింపు కార్డులో తప్పులు, సరిదిద్దుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్, అధికారులు ఉన్నారు.

ఆధార్ కేంద్రానికి అడ్డంగా తహసీల్దార్ కారు

పెద్ద కొడప్‌గల్, జనవరి 18: రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్టుగా ఉంది పెద్ద కొడప్‌గల్ తహసీల్దార్ వ్యవహారశైలి. పెద్ద కొడప్‌గల్ తహసీల్దార్ కార్యాలయం మండల కేంద్రంలో పాత పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసి తహసీల్ సేవలు కొనసాగిస్తున్నారు. ఈ భవనంలోనే ప్రజల సౌకర్యార్థం అధికారులు ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆధార్ సెంటర్‌కు ప్రతినిత్యం పదుల సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. ఉన్నదే చిన్నపాటి రూం దాని ఎదురుగా గురువారం తహసీల్దార్ తన కారును ఆధార్ కేంద్రానికి అడ్డంగా పెట్టడంతో ఆధార్ సెంటర్‌కు వచ్చిన వినియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆధార్ సెంటర్ ముందు కారును ఎందుకు పెట్టారని వినియోగదారులు తహసీల్ సిబ్బందిని అడిగితే బయట ఎండకు కారు పెడితే రంగు పోతుందని తహసీల్దార్ అన్నారని సిబ్బంది సమాధానం ఇవ్వడంతో అక్కడున్న వారు నివ్వెరపోయారు.

పంటల పరిశీలన

భిక్కనూరు, జనవరి 18: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో గురువారం వ్యవసాయాధికారులు వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో రాధ మాట్లాడుతూ.. గ్రామంలో వరిపంటకు కాండం తొలుచు పురుగు ఆశించిందని, దాని నివారణకు రైతులు కర్టప్ హైడ్రోక్లోరైడ్‌ను ఒక ఎకరానికి ఎనిమిది కేజీలు చల్లుకోవాలన్నారు. అనంతరం రిలియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంటలకు డ్రోన్ ద్వారా మందుల పిచికారి చేయ్యడం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతిరెడ్డి, ఏఈవో వినోద్, వీడీసీ చైర్మన్ తక్కళ్ల నర్సారెడ్డి, రైతులు, రిలియన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుకూలంగా ఉన్న పంటలు వేయాలి

గాంధారి, జనవరి 18: వాతావరణానికి అనుకూలంగా ఉన్న పంటలను మాత్రమే వేయాలని మండల వ్యవసాయాశాఖధికారి నరేష్ అన్నారు. గురువారం గాంధారి మండలంలోని సీతాయిపల్లి, వెంకటాపూర్ గ్రామాల పరిధిలోని జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల చీడపీడలకు నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ప్రతిరైతు ఆ గ్రామంలోని వ్యవసాయశాఖ సూచనలను పాటించి లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు జ్యోష్ణు, దీక్షిత్, రైతులు పాల్గొన్నారు.

కాషాయపు జెండా, పుస్తకాల అందజేత

బాన్సువాడ, జనవరి 18: మండలంలోని దేశాయిపేట గ్రామంలో గురువారం ఇంటింటికీ కాసాయపు జెండా, రామభక్తుల పోరాట చరిత్ర పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న సందర్భంగా రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 ఇళ్లకు కాషాయపు జండాలతో పాటు పుస్తకాలను అందజేయడం జరిగిందన్నారు.

మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో దొడ్డు వడ్లు వేలం

నాగిరెడ్డిపేట, జనవరి 18: మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రంలో గురువారం విత్తనం కోసం ఉపయోగపడని 120 క్వింటాళ్ల దొడ్డు రకం వడ్లను విత్తన క్షేత్రంలో అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. విత్తన క్షేత్రంలోని విత్తనం కోసం ఉపయోగపడని దొడ్డు రకం వడ్లు జేజీఎల్ 24423 రకం 90 క్వింటాళ్లు, కేఎన్ఎం 118 రకం 30 క్వింటాళ్లు వేలం వేయగా, పలువురు వ్యాపారులు ఈ వేలం పాటలో పాల్గొన్నారు. క్వింటాల్ వడ్లకు రూ.2,280 పాట పాడి మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన శ్రీనివాస్ వడ్లను కైవసం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మీ, ఆర్ఎం, టీఎస్ఎస్ డీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం, విత్తన క్షేత్రం ఏడీఏ వీరాస్వామి, ఏవో విజయ్‌శేఖర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

బీర్కూర్, జనవరి 18: తెలుగుదేశం వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా బీర్కూర్ మండల కేంద్రంలోని రంగాజీనగర్ చౌరస్తాలో తెలుగుదేశం నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు కమ్మ సత్యనారాయణ, ఓంకార్, ఇరాస్ సాయిలు, వెంకటేశ్వరరావు, చందు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలం కృష్ణాజీవాడి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, బద్దం గంగారెడ్డి, కమ్మరి శంకర్, నాగరాజు, బాల్‌రెడ్డి, నర్సయ్య, శివరాజు, రాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ యువజన ఉత్సవాలు ప్రారంభం

కామారెడ్డి టౌన్, జనవరి 18: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శాఖ ఆధ్వర్యంలో యువజన వారోత్సవాల్లో భాగంగా గురువారం క్రీడపోటీలను జిల్లా ప్రముక్ గిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుతో పాటు శారీరకంగా దృఢంగా ఉండాలని జీవితంలో క్రీడల మాదిరిగానే ఒడిదొడుకులు స్వాగతిస్తు ఉండాలని తెలిపారు. జూనియర్ కళాశాల పోటీలకు దాదాపుగా 650 మంది విద్యార్థులు వచ్చి ఆటపోటీలలో పాల్గొన్నారు. ఈ క్రీడాపోటీలను శుక్ర, శనివారాలు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, విభాగ్ వ్యవస్థ ప్రముఖ్‌స్వామి, నగర అధ్యక్షులు అనిల్, జిల్లా ఖేల్ కన్వీనర్ రోహిత్, జిల్లా హస్టల్ కన్వీనర్ ఖలీల్, నగర కార్యదర్శి చరణ్, నగర ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ సంజయ్, ప్రత్యూష, మానస, నవీన్,చరిత్, రాజు,సిద్దు,సమీర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

బాన్సువాడ టౌన్, జనవరి 18: జాతీయ బీసీ సంక్షేమ సంఘం బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాన్సువాడ పట్టణానికి చెందిన గొంట్యాల బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బీసీ సంక్షేమ సంఘం బాధ్యతలను అప్పజెప్పిన జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్, ఉపాధ్యక్షుడు కాముని సుదర్శన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో బీసీ కుల సంఘాల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి, సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. బీసీలంతా ఏకమైతే అసాధ్యమనేది ఏదీ లేదన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బాన్సువాడటౌన్, జనవరి 18: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్ 2024ను మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలంతా ఐకమత్యంగా మెలగాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అందరూ కలిసి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి గొంట్యాల బాలకృష్ణ, కనుకుట్ల రాజు, భూషణ్, ఉప్పరి లింగం, రాజు, రాములు, సర్దార్ తదితరులున్నారు.

చెత్తను బయట వేస్తే నోటీసులు జారీ చేయాలి

● ఎంపీడీవో చిన్నారెడ్డి



దోమకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో చిన్నారెడ్డి

దోమకొండ, జనవరి 18: గ్రామ పంచాయతీ ప్లాన్ తయారు చేయాలని ఎంపీడీవో చిన్నారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఐకేపీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 29 శాఖల నుంచి వివరాలను సేకరించాలని, ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించాలన్నారు. అలాగే ఎవరైన చెత్తను బయట వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాలను అందంగా తిర్చీదిద్దే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని ఎవరైన నిబంధనలు పాటించకుంటే వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఎం రాజు, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో రజని, టీఏలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

I, MATTA SRUJAN KUMAR S/O BAJAM SUNIL KUMAR (OLD NAME) H.NO. 6-61/2, ANKAPOOR (VILL), ARMOOR (M), NIZAMABAD (DIST).T.S.HAVE CHANGED MY NAME AS BAJAM SRUJAN KUMAR S/O BAJAM SUNIL KUMAR (NEW NAME)
AJZ

CHANGE OF NAME

I, MATTA PADMA W/O BAJAM SUNIL KUMAR (OLD NAME) H.NO. 6-61/2, ANKAPOOR (VILL), ARMOOR (M), NIZAMABAD (DIST). T.S. HAVE CHANGED MY NAME AS BAJAM PADMA W/O BAJAM SUNIL KUMAR (NEW NAME)
AJZ

CHANGE OF NAME

I, YELALA VENKAT RAJU, CHANGED MY DAUGHTER NAME YELALA MIDHUNA REDDY TO YELALA HANVIKA REDDY VIDE AFFIDAVIT DT. 18.01.2024 SWORN BEFORE NOTARY A.MURALIDHAR, NIZAMABAD.
AJZ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రతి రోజు... క్లాసిఫైడ్స్

-: సంప్రదించవల్సిన నెంబరు :-
కామారెడ్డి : 9985411453



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- నా సామి రంగ
ప్రియా 35	- సైందవ్

బాన్సువాడ

మహేశ్వరి	- గుంటూరు కారం
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

